పండుటాకులకు నిండు భరోసా!

- అవసాన దశలో భరోసా కల్పిస్తున్న నిరాశ్రయుల ఆశ్రమం
- తెనాలిలో పదేళ్ల క్రితం రెండు ఆశ్రమాలు ఏర్పాటు
- మూతబడిన ఒక ఆశ్రమం
- శ్రీసాయి సేవా సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న మరో ఆశ్రమం


ఆశ్రమంలో భోజనం చేస్తున్న వృద్ధులు

తెనాలిఅర్బన్: గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉండటం వల్ల వృద్ధాప్యంలోకి వచ్చిన వారికి చీకు చింత లేకుండా కాలం గడిచేది. కానీ నేడు మారుతున్న కాలానికి అనుగుణంగా పిల్లలు మారుతుండటం...డబ్బు సంపాదనే ధ్యేయంగా ఎక్కువమంది పిల్లలు భావించటంతో వారు తమ తల్లిదండ్రులను వదిలేసి ఇతర దేశాలు, రాష్ట్రాలలో నివసించటం పరిపాటిగా మారింది. ఎలాంటి ఆదరణలేని వృద్ధులకు తెనాలి గాంధీనగర్‌లోని నిరాశ్రయుల ఆశ్రమం భరోసా కల్పిస్తుంది. శ్రీసాయి సేవా సమితి నిర్వాహకులు వెడ్ ప్రకాష్ చాందనా వారికి భోజన వసతి కల్పించటంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ వారి జీవితాలలో వెలుగులు నింపుతున్నారు.

సకల వసతులు..

తెనాలి పట్టణంలోని అనేక ప్రధాన రహదారులపై వృద్ధులు జీవిస్తుండేవారు. వీరికి ఒక ఆశ్రమం కల్పించాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం మెప్మా విభాగం ఆధ్వర్యంలో తెనాలి పట్టణంలోని బాలాజీ రావుపేటలో ఒకటి, గాంధీనగర్‌లో మరొకటి నిరాశ్రయుల ఆశ్రమాన్ని 2014లో ఏర్పాటు చేశారు. వాటి నిర్వాహణను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించారు. వాచ్‌మెన్, వంట మనిషి, ఒక ఉద్యోగిని నిర్వాహకులు నియమించారు. వారి ద్వారా ఎటువంటి ఆదరణ లేని వృద్ధాప్యంలో ఉన్నవారికి అక్కడ వసతి కల్పించారు. వృద్ధులు పండుకునేందుకు అవసరమైన ఇనుప మంచాలు, పరుపులు ఇచ్చారు. వారికి అవసరమైన బాత్‌రూంలు ఏర్పాటు చేశారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన వసతి కల్పించారు. ప్రతిరోజు అవసరమైన బ్రష్, పేస్ట్, సోప్స్ వంటి వాటితో పాటు దుప్పట్లు, దుస్తులు ఇచ్చారు. వృద్ధులకు అన్ని వసతులు కల్పించినందుకు మెప్మా విభాగం ఏడాదికి రూ.4 లక్షల చొప్పున ఒక్కో ఆశ్రమానికి చెల్లించింది. దీని కాలపరిమితి 5 సంవత్సరాలు దాటటంతో బాలాజీరావుపేటలోని ఆశ్రమాన్ని నిర్వాహకులు మూసివేశారు.

శ్రీసాయి సేవా సమితి సహకారంతో...

గాంధీనగర్‌లోని నిరాశ్రయుల ఆశ్రమ నిర్వాహణ బాధ్యతను శ్రీసాయి సేవా సమితి నిర్వాహకులు వెడ్ ప్రకాష్ చందనా 2015లో తీసుకున్నారు. 2019 కోవిడ్ సమయంలో మెప్మా అధికారులు వచ్చి సొంతగా నిర్వహించుకోవాలని లేని పక్షంలో మూసివేస్తామని చెప్పారు. వృద్ధులకు సేవ చేయాలనే ఉద్దేశంతో చందనా దీనిని మూసివేసేందుకు ఇష్టపడలేదు. తాను సంపాదించే దానిలో కొంత దీనికోసం వెచ్చించాలని భావించి అప్పటి నుంచి దాతల సహకారం కొంత తీసుకుని మిగిలిన నిధులను తాను భరిస్తూ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ 25 మంది ఉంటున్నారు. వీరిలో 14 మంది పురుషులు, 11 మంది స్త్రీలు ఉంటున్నారు. వీరికి వేరువేరుగా పండుకునే గదులు ఏర్పాటు చేశారు. అలాగే ఎనిమిది బాత్ రూంలలో వేడి నీటికోసం గీజర్‌లు ఏర్పాటు చేశారు. ఆశ్రమ నిర్వాహణకు ఏడాదికి రూ.8లక్షలు వెచ్చిస్తున్నట్లు చందనా తెలిపారు. నాలుగు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురయితే ప్రభుత్వ వైద్యశాల, మమత వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. అనుకోకుండా చనిపోతే వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందిస్తారు. వారు రాలేమని చెబితే అలాంటి వారిని శ్రీశివలింగేశ్వర భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను సహకారంతో అంత్యక్రియలు చేస్తున్నారు. తెనాలిలోని నిరాశ్రయుల ఆశ్రమం అవసాన దశలోని వారికి పూర్తిగా అండగా ఉంటూ నిండు భరోసానిస్తుంది.

వృద్ధులు ఎవరైనా చేరవచ్చు..



ఎటువంటి ఆదరణలేక వృద్ధాప్యంలో అనేక మంది ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి వారికి సేవా చేయాలనే ఉద్దేశంతో దీని నిర్వాహణ బాధ్యతలు తీసుకున్నాం. 2019 నుంచి ఇప్పటి వరకు మా సొంత నిధులతో దీనిని నిర్వహిస్తున్నాం. ఎవరైన ఇలాంటి వారు ఉంటే మమ్మల్ని సంప్రదిస్తే ఆశ్రమంలో చేర్చుకుంటాం. వృద్ధులకు సేవ చేయటం చాలా తృప్తిని ఇస్తుంది.

–వెడ్ ప్రకాష్ చందనా, శ్రీసాయి సేవా సమితి నిర్వాహకులు

పదేళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాను..



మాది చీరాల. నా భర్త 15 సంవత్సరాల క్రితం చనిపోయారు. నాకు ఇద్దరు మగ, ఇద్దరు ఆడ పిల్లలు. వారందరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. నలుగురు పిల్లలూ పట్టించుకోకపోవటంతో 10 సంవత్సరాల క్రితం నిరాశ్రయుల ఆశ్రమంలో చేరాను. ఇక్కడ వంట చేస్తూ జీవిస్తున్నాను. మాకు అవసరమైన అన్ని వసతులు ఇక్కడ కల్పించారు.

–దేవరపల్లి దుర్గ, చీరాల

క్లుప్తంగా

పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



తెనాలిఅర్బన్: పట్టణంలోని మ్యాన్‌హోల్స్‌లో ఉన్న వ్యర్థాలను తొలగించి మురుగు పారుదల జరిగే విధంగా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి ఆదేశించారు. పట్టణంలోని 35వ వార్డులో సోమవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్ల పక్కన ఉన్న వ్యర్థాలను తొలగించేవిధంగా చర్యలు తీసుకున్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

లోక రక్షకుడు ఏసుక్రీస్తు



తెనాలిఅర్బన్: లోక రక్షకుడు ఏసుక్రీస్తు అని, ఆయన మానవులను పవిత్రులుగా మార్చేందుకు భూలోకానికి వచ్చారని సండే స్కూల్‌టీచర్ పిల్లి ప్రేమరాజు పేర్కొన్నారు. చినరావూరులోని ఆంధ్ర ఇవాజిలికల్ లూథరన్ చర్చిలో సోమవారం సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నపిల్లలకు బైబిల్ క్విజ్, డ్రాయింగ్, పాటల పోటీలు, కంఠత వాక్యాలు వంటి పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి క్రిస్మస్ పండుగ రోజున బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. సండేస్కూల్ టీచర్ దీనమ్మ, చిన్నారులు, వారి తల్లిదండ్రులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్‌పై అవగాహన



తెనాలిఅర్బన్: క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్‌పై విద్యార్థులందరూ అవగాహన కలిగి ఉండాలని హైదరాబాద్‌కు చెందిన క్లినాక్సీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు వి.సతీష్‌కుమార్ పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో క్లినికల్ రిసెర్చ్ అండ్ క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్, సాఫ్ట్‌వేర్ టూల్స్‌పై సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటిపై అవగాహన కలిగి ఉండటం వలన వృత్తిపరమైన నైపుణ్యం లభిస్తుందని చెప్పారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వెంకటరమణ, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.సాయిరాజేష్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ షేక్ అంజాద్ ఆలీ, హెచ్‌ఓడీ డాక్టర్ జ్యోతిబసు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ఆభరణాలు చోరీ

తెనాలిరూరల్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుల బ్యాగులో ఉన్న బంగారు ఆభరణాలు చోరీకి గురవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ గంగానమ్మపేటకు చెందిన చీదెళ్లి వెంకటసాంబశివరావు తన భార్యతో కలసి 14వ తేదీన గుంటూరులో ఓ వివాహానికి వెళ్లారు. తిరిగి 15వ తేదీ మధ్యాహ్నం ఆర్టీసీ బస్సులో తెనాలి బయలుదేరారు. ఇంటికి వెళ్లి చూడగా బ్యాగులో ఉంచిన ఆభరణాలు కనబడలేదు. చివరకు టూ టౌన్ పోలీసులను సోమవారం ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిలిచిపోయిన గణిత పరీక్ష

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఇతర సబ్జెక్టుల ప్రశ్నా పత్రాలు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ, దుగ్గిరాల మండలంలో జరుగుతున్న ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల్లోని ఎస్‌ఏ-1 పరీక్షలకు సంబంధించి ప్రశ్న పత్రాలను విద్యాశాఖ అధికారులు భద్రపరిచారు. సోమవారం జరగాల్సిన గణిత పరీక్షను కూడా తాత్కాలికంగా వాయిదా వేశారు. మ్యాథ్స్ పరీక్ష పత్రాన్ని గుర్తుతెలియని వ్యక్తులు యూట్యూబ్‌లో పెట్టడంతో పరీక్షలను అర్ధంతరంగా నిలిపివేశారు. ప్రశ్న పత్రాలను విద్యార్థుల నుంచి తీసివేసుకున్నారు. జరగాల్సిన సబ్జెక్టుల ప్రశ్న పత్రాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌ల్లో భద్రపరిచారు. ప్రతిరోజు ఉదయం 8 గంటలకు విద్యాశాఖ అధికారులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ప్రశ్న పత్రాలు తీసుకువెళ్లి ఆయా పాఠశాలల్లో అందించాల్సి ఉంది. ఇలా చేయడం వల్ల సమయం సరిపోదని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిష్కార వేదికకు 8 అర్జీలు



తెనాలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల ఫిర్యాదుల (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు ఎనిమిది అర్జీలను సమర్పించారు. సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ అర్జీదారుల దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత శాఖలకు పంపి, నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. అర్జీలలో రెవెన్యూకు సంబంధించి ఒకే ఒక దరఖాస్తు రాగా, గృహనిర్మాణ సంస్థ, గుంటూరు జీజీహెచ్, ఆర్టీఓ, ఐసీడీఎస్, పీడీ–డీఆర్‌డీఏ, ఏడీ–మార్కెటింగ్‌కు సంబంధించి ఒక్కో అర్జీ చొప్పున వచ్చాయి.

పూలే కాలనీలో వీధిదీపాలు ఏర్పాటు చేయండి..

తెనాలిఅర్బన్: పూలే కాలనీలో వీధిదీపాలు ఏర్పాటు చేయడంతో పాటు రక్షిత మంచినీటి పథకం కుళాయి కనెక్షన్‌ను ఇవ్వాలని ఆ ప్రాంతవాసులు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. పూలే కాలనీ వాసులు తెలియజేసిన సమస్యలను విన్న కమిషనర్ వాటి ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలకు శ్రీకారం


తిరుప్పావై పాశురాల పారాయణం


ప్రారంభించిన నరేంద్ర రామానుజ దాసస్వామి

తెనాలి: స్థానిక మారిస్‌పేటలో వేంచేసిఉన్న కోదండరామస్వామి దేవస్థానం (రామభక్త అప్పలస్వామి గుడి)లో ధనుర్మాసం ప్రారంభ రోజు పురస్కరించుకొని ప్రాతఃకాల సమయంలో శ్రీకృష్ణుడు, గోదాదేవి అమ్మవారికి విశేష పూజాధికాలు, అర్చనలు జరిగాయి, శ్రీమతి దుర్గ పూర్ణ కుమారి భవాగ్ని మండలి సభ్యులచే తిరుప్పావై పాశురాల పారాయణం, విష్ణుసహస్రనామం పారాయణం ప్రారంభించారు. ఈ పారాయణం ధనుర్మాసం అంతా కొనసాగుతుందని, జనవరి 10వ తేదీన ముక్కోటి ఏకాదశి వేడుకలు, ఉత్తరద్వార దర్శనం ఘనంగా నిర్వహిస్తామని ధర్మకర్త శివానంద కుమార్ తెలియజేశారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ధర్మకర్తలు కునపల్లి నారాయణస్వామి, లంక శివానంద్ కుమార్, లంక శివ ఆంజనేయ ప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు దినమని ధనుష్ సుబ్రహ్మణ్య శర్మ పూజాధికాలు నిర్వహించారు.

ధనుర్మాస వ్రత మహోత్సవాలు ఆరంభం...

తెనాలి: శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి మంగళాశాసనాలతో శ్రీశరణాగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నరేంద్ర రామానుజ దాసస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీధనుర్మాస వ్రత ప్రయుక్త శ్రీకృష్ణదీక్షా మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. జనవరి 13వ తేదీ వరకు జరిగే ఈ ధనుర్మాసవ్రతంలో తొలిరోజున తిరుప్పావై పాశురాన్ని, అర్థాన్ని విశేషంగా తెలియజేశారు. భక్తులు విశేషసంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన రగ్బీ రాష్ట్రస్థాయి పోటీలు


విజేత జట్లతో ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం: నైతిక స్థైర్యం, పట్టుదలతో గెలుపును సాధించవచ్చని ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ రంజన్ బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాల ఆట స్థలంలో రెండు రోజులుగా పల్నాడు రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ రగ్బీ ఆటల పోటీలు సోమవారంతో ముగిసాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. గెలుపొందిన వారిని అభినందించారు. పలు జిల్లాల నుంచి వచ్చిన 30 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. కర్నూలు జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానం సంపాదించగా, ప్రకాశం, నెల్లూరు జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచాయి. బాలికల విభాగంలో సత్యసాయి జిల్లా జట్టు విజయం సాధించింది. తూర్పుగోదావరి, గుంటూరు జిల్లాల జట్లు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ విజేతలకు ట్రోఫీలు అందజేశారు. జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇ.కృష్ణారెడ్డి, రామాంజనేయులు, కార్డ్ సంస్థ ఫౌండర్ డాక్టర్ ఎం.స్వర్ణ లతాదేవి, డాక్టర్ రంజన్‌బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ కె.మేరీ, ప్రిన్సిపల్స్ ఎండి.సుదర్శన్, డి.జీవన్‌మణి, టి.అమర్‌నాథ్, మండవ. నరసింహారావు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలి


శిబిరంలో కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బ్రహ్మానందపురంలో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు ఎం. శివకుమారి, వేముల దుర్గారావు, బి.వెంకటేశ్వర్లు, ఎఫ్‌టీయూ న్యూ నాయకులు కె.కోటేశ్వరరావు, సీపీఐ నాయకులు కంచర్ల కాశయ్య ప్రారంభించి, మాట్లాడారు. ప్రభుత్వం కార్మికుల సమస్యను పరిష్కరించినట్లయితే వందలాది కుటుంబాలకు మేలు చేసినట్లు అవుతుందన్నారు. మంత్రి నారా లోకేష్ ఈ విషయంలో చొరవ చూపించి, సమస్య పరిష్కరించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెల్, ఎస్కే సుభాని, డి. నాగేశ్వరరావు, టి. దుర్గాభవాని, గురవయ్య, డి. నాగమల్లేశ్వరి, శారమ్మ, రమాదేవి, బి.అంకయ్య, ఆశీర్వాదం పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

కొల్లిపర: మండలంలో వివిధ గ్రామాలల్లోని పాఠశాలలు, అంగ్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల కోసం ఆధార్ క్యాంపులు మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఆమె మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ 17,18,19 తేదీలలో వల్లభాపురం, మున్నంగి, అత్తోట, కొల్లిపర గ్రామాల్లో జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో 19న తూములూరు హైస్కూల్‌లో, 20న వల్లభాపురం, మున్నంగి, అత్తోట, తూములూరు ఆయా గ్రామాలల్లో హైస్కూల్‌లో, 26, 27, 28తేదీలలో వల్లభాపురం గ్రామ సచివాలయంలో, మున్నంగి అంగన్‌వాడీ కేంద్రం-1లో, అత్తోట అంగన్‌వాడీ సెంటర్-1లో, చక్రాయపాలెంలో మండల ప్రాథమిక పాఠశాలలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లోని విద్యార్థులు ఆధార్ కార్డులలో తప్పులు ఉన్నా, ఫోన్ నెంబర్ మార్చుకోవాలన్నా, కొత్తగా ఆధార్ కార్డు కావాలన్నా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదే విధంగా గ్రామంలో విద్యార్థులతో పాటు ప్రజలు కూడా ఎవరైన ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవాలని అనుకుంటే ఈ క్యాంపులలో సరైన ధ్రువ పత్రాలు తీసుకుని చేయించుకోవచ్చని తెలిపారు.

ఆధార్ క్యాంపులు..

మంగళగిరి: మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు 6 కళాశాల్లో ఆధార్ సెంటర్‌లు ఏర్పాటు చేసి, సచివాలయ సిబ్బందిని నియమించామని పేర్కొన్నారు. మంగళవారం నుంచి 28వ తేదీ వరకు క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కొత్త పేట నిర్మల కళాశాల, వడ్లపూడి చైతన్య స్కూలు, టిప్పర్ల బజార్ నారాయణ స్కూలు, పెదవడ్లపూడి విజేత స్కూలులో 17, 18, 19, 20, 26, 27, 28వ తేదీలు, వడ్డేశ్వరం జెడ్పీ హైస్కూల్లో 17, 18, 19, పెనుమాక జెడ్పీలో 20, 26, అరవింద హైస్కూలులో 27, 28, మహానాడు సింధు నికేతన్, ఉండవల్లి హైస్కూలులో 17న, తాడేపల్లి జెడ్పీ హైస్కూలులో 18, 19, మహానాడు శ్రీ ప్రతిభ హైస్కూలులో 20, 26, నులకపేట సచివాలయంలో 27, 28న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పూలే స్మృతి వనం నిర్మించాలి

మంగళగిరి: ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎదుట 10 ఎకరాల్లో రూ.10 కోట్ల వ్యయంతో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి భాయిల స్మృతి వనాన్ని నిర్మించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అమరావతిలో సివిల్స్ కోచింగ్ సెంటర్‌తో పాటు అన్ని రకాల పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. 26 జిల్లాల్లో బీసీ స్టడీ సర్కిళ్లు, బీసీ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బీసీ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల సంఖ్యను పెంచాలని తెలిపారు.

విద్యుత్ బిల్లుల పెంపు అక్రమం

సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లుల దహనం


విద్యుత్ బిల్లులను తగలబెడుతున్న సీపీఎం నాయకులు

తెనాలిఅర్బన్: ఎన్నికల సమయంలో విద్యుత్ బిల్లులను పెంచబోమని ప్రకటించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ట్రూ అప్, ఎఫ్‌పీపీసీఏ పేరిట అదనపు చార్జీలను ప్రజలపై మోపడం దుర్మార్గమని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఎం తెనాలి కమిటీ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు కాలనీలో సోమవారం బిల్లులను తగులబెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చార్జీల పెంపువలన ప్రజలపై అదనపు భారంపడి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కొల్లిపర బాబుప్రసాద్, షేక్ హుస్సేన్‌వలీ, ఎస్.రాజలక్ష్మి, వై.ఈశ్వరి, ఆశాబీ, తదితరులు పాల్గొన్నారు.

వనరులను పొదుపుగా వాడుకోవాలి


ర్యాలీగా వెళుతున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

తెనాలిరూరల్: పొదుపుగా వాడుకోకపోతే భావితరాల వారికి వనరులు ఉండవనే దృక్పథంతో ఎప్పటిలాగానే విద్యుత్ పొదుపుపై విద్యుత్ శాఖ ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇందన పొదుపు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెనాలి విద్యుత్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ చిరంజీవి తెలిపారు. ప్రజల్లో అవగాహన కలిగించేందుకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో డివిజన్ కార్యాలయం నుంచి చెంచుపేటలోని ఉమేష్ చంద్ర విగ్రహం వరకు సోమవారం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని తద్వారా దేశ ప్రగతికి తోడ్పడాలని డీఈఈ చిరంజీవి అన్నారు. విచ్చలవిడిగా బొగ్గుని వివిధ రంగాలకు వాడటంతో ఇప్పటికే బొగ్గు వనరులు తగ్గాయని అలాగే డ్యాంలో వాటర్ సోర్స్ లేక విద్యుత్తు ఉత్పత్తి తగ్గుతోందని గుర్తు చేశారు. ముఖ్యంగా విద్యుత్ వాడకంలో పొదుపు పాటించాలని డీఈఈ కోరారు. ఏడీఈ బి. అశోక్ కుమార్, ఏఈలు పీవీ సుధీర్, లక్ష్మీనారాయణ, ఏఏఓ లీలావతి, ఉద్యోగులు కార్మిక సిబ్బంది పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు!


రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న రాళ్లు

కీలకమైన రహదారి...అందులోనూ రెండు పంటకాల్వలపై గల వంతెనల మధ్య సిమెంటు రోడ్డు... సగానికి పగులగొట్టి వదిలేశారు. పదిరోజులుపైగా అయింది. భారీ వాహనాలు రాకపోకలతో ట్రాఫిక్ రద్దీ సంగతటుంచి, తెలియకుండా వచ్చే ద్విచక్రవాహనాలు బోల్తాకొడుతున్నాయి. నడిరోడ్డులో తవ్వేసిన రాళ్లు ప్రమాదాలకు ఆస్కారమిస్తున్నాయి. పట్టణంలో పడమర కాల్వ, నిజాంపట్నం కాల్వలపై గల వంతెనల మధ్య రోడ్డు దుస్థితి ఇది. ఇప్పటికైనా అక్కడివరకు పూడ్చించి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

– తెనాలి

మరమ్మతులకే పరిమితం.. నూతన వంతెనకు మంగళం

రేవేంద్రపాడు బ్రిడ్జికి మరమ్మతులు


రేవేంద్రపాడు బ్రిడ్జికి ఏర్పాటు చేస్తున్న ఐరన్ గడ్డర్లు

తాడేపల్లిరూరల్ : బకింగ్ హామ్ కెనాల్‌పై రేవేంద్రపాడు వద్ద ఉన్న బ్రిడ్జికి కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం మరమ్మతులు చేపట్టారు. ఈ బ్రిడ్జి కొన్ని సంవత్సరాల నుంచి శిథిలావస్థకు చేరింది. కొత్త బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని ప్రజలు, ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు. ఈ లోపే కార్పొరేషన్ నుంచి రూ.15 లక్షల నిధులు కేటాయించి, సైడ్ రైలింగ్ నిర్మాణాన్ని ఐరన్ గడ్డర్లతో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రజలు కొత్త బ్రిడ్జి నిర్మాణం ఉందా లేదా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి రూరల్ పరిధిలోని నూతక్కి, రామ చంద్రాపురం, తాడేపల్లి మండల పరిధిలోని చిర్రావూరు, మెల్లెంపూడి, వడ్డేశ్వరం ప్రజలు మంగళగిరి వెళ్లాలంటే ఇదే రహదారిని ఉపయోగిస్తారు. కొత్త బ్రిడ్జిపై ఆశలు పెట్టుకున్న వారికి నిరాశే ఎదురైంది.

గోదాదేవి అమ్మవారికి ధనుర్మాస పూజలు

మంగళగిరి: పట్టణంలోని పోలేరమ్మ గుడి వీధిలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని యతిరాజ సేవా మండలి ఆధ్వర్యంలో సోమవారం ధనుర్మాస వ్రత పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథ స్వామి, గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవాచార్యులు పూజలు నిర్వహించారు. సేవా మండలి ప్రతినిధులు డోగిపర్తి లక్ష్మీ భగవతి సుందరి, లక్ష్మీ అంజన, పద్మావతి, మాణిక్యం, లక్ష్మీపద్మజ,సత్యవతి, రత్న, డోకిపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి ధనుర్మాస పూజలు..

ఫిరంగిపురం: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని మొదటిరోజు మండల కేంద్రంలోని గీతామందిరంలో గోదాదేవి సహిత రంగనాథస్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు అర్చకులు వి.రాజేంద్రశర్మ పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, అష్టోత్తర, సహస్ర నామాలతో పూజలు చేశారు. ఆర్యవైశ్య మహిళా సంఘం, గీతాభజన మండలి ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామాలు, పాశురాలు గానం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ డి.నరేంద్రకుమార్, కె. వెంకటేశ్వర్లు, జి. మధుసూదన్‌రావులు పర్యవేక్షించారు.